కథ

# గట్టు తెగిన ఊరు

## శిరంశెట్టి కాంతారావు

నించుంటే నీడ కనిపించని ఎండ నిప్పులు చెరుగుతుంది.

గింజుపల్లి రేబొద్దున చింతమాను తొర్రలో ఉన్న గద్దల జంట ఎండకు ఓర్వలేక 'క్రిహ్హీహీ... క్రిహ్హీహీ..." అంటూ తడవకోమారు అరుస్తుంది.

ఉండుండీ వో వడగాడ్పు తెర కృష్ణమ్మకు ఈవలి వొడ్డునున్న వేదాద్రి స్వామి ఆలయగోపురం మీదుగా బయలదేరి ఆవలి వొడ్డునున్న ముక్త్యాల రాజావారి కోట బురుజులను 'ఢీ'కొట్టి వచ్చిన దారిన్నే వెనక్కి మళ్ళుతుంది.

ఆ మిట్ట మధ్యాహ్నపు వడగాలిలో ఎద్దుల బండి ఒకటి దుమ్ము లేపుకుంటూ గింజుపల్లి రేవు లోకి దిగుతుంది.

బండికున్న ఎడ్లు రెండూ ఎండకు తట్టుకోలేక 'హుస్‌లు' కొడుతున్నాయి.

చెవుల్లో వడగాలి చొరబడకుండా తలపాగా చుట్టుకుని తొట్టిగెడల్లో కూర్చున్న ముసలయ్య నోటితో శ్వాస తీసుకుంటూ ఎండను కాచుకుంటున్నాడు.

ముసలయ్య కిప్పుడు ముప్పై ఏడేండ్లు. కొంచం రంగు తక్కువతో చేవదేరిన చంద్ర దుంగలా గట్టిగా ఉంటాడు. కోరా కలర్ లుంగీ కట్టుకుని, దానిమీద తెల్లచొక్కా తొడుక్కున్నాడు. ఎడమ పాపిట తీసి దువ్విన నొక్కులజుట్టు. మందంగా పెంచిన మీసకట్టు. చూడ్డానికి మనిషి ఏమీ తెలియని పల్లెటూరి బైతులా కన్పిస్తున్నా కళ్ళెదుట జరిగే అన్యాయాన్ని నిలదీసి అడిగే స్వభావం ఉన్నవాడు ముసలయ్య.

ముసలయ్య ఈ మధ్యనే తాతలనాటి పెంకుటింటిని కూలదోసి దాని అడుగున్నే రెండు గదుల గవర్నమెంటు డాబా ఇల్లు మొదలుపెట్టాడు.

అదుగో, ఇప్పుడా ఇంటికోసమే ఎండను కూడా లెక్కచెయ్యకుండా ఇసుక బండి కట్టాడు ముసలయ్య.

రేవులో పడమరదిక్కున ఇసుక టిప్పర్లు నింపుతున్న కూలీల సందడి స్పష్టంగా వినబడుతున్నా అటువైపు తల తిప్పికూడా చూడకుండానే ఇసుక ధగడుకి వంట్లో నీరంతా ఆవిరై మాంసం ఉడికి పోతున్నా సోయి లేకుండా పున్నమి నాడు వెన్నెల కుప్పలాడుతున్న పిల్లగాళ్ళ మాదిరిగా ఎంతో ఉషారుగా ఇసుక గంపలు మోస్తున్నారు గాని ఆడుతు - పాడుతు పన్జేసే రైతువారి పన్లకు మాత్రం రావట్లేదు! వీటమ్మి సిగదరగ! ఊళ్ళోకి ఈ ఇసుక కోరీలొచ్చిన దగ్గర్నుండి ఊరు, ఊరు తీరుగా లేకుండా బోయింది గదూ!" అనుకుంటూ ఎద్దుల్ని అదిలించాడు ముసలయ్య.

అంతలో !

వేదాద్రి రేవులో నుండి పడవ మీదుగా గింజుపల్లి రేవులో ఇసుక టిప్పర్ల దగ్గరకొస్తూ కన్పించాడు వీరభద్రం.

అతన్ని చూస్తూనే 'ఓస్, మిమ్మల్ని సంతకు దోల, బుద్దపిడిందులు బలిసినట్టు బలిశారు గాని నడవడానికి ఛస్తున్నారేందీ?" చర్నాకోలతో ఎద్దుల వెన్నుల మీద చరుస్తూ అన్నాడు ముసలయ్య.

ముసలయ్య మాటలు విన్న వీరభద్రం "వీడియమ్మ ! వచ్చి వచ్చి వీడికంట్లో పడ్డానే. నిజంగా వాడా ఎద్దుల్ని తిడుతున్నాడో ? లేకుంటే వాటిమీద పెట్టినన్నే తిడుతున్నాడో ? ఏదైనా వీడినోట్లో నోరుపెట్టే దానికన్నా, నోరు మూసుకోవడం మంచిది. ఒకవేళ అట్లని ఊరుకుంటే అసలే లెక్క చెయ్యడేమో?" అనుకుంటూ పడవదిగి నేరుగా బండిదిక్కు రా సాగాడు..

వీరభద్రాన్ని అంతదూరం నుండే చూస్తూ "ఏందయో వీరభద్రం! ఏందీకత? బండి కెదురొస్తున్నా వేంది?" అదో రకమైన వెటకారంతో ప్రశ్నించాడు ముసలయ్య.

"అబ్బా ! ఏం చమత్కారం మగాడివయా! అనేయన్నీ అనుకుంటూనే మళ్ళీ నేరనట్టే మాట్లాడుతున్నావే ! లక్షలు పోసి రేవులు పాడింది మీలాంటోళ్ళంతా పున్నానికి తోలుకు పోయేటందుకు కాదు. దబాయిస్తున్నట్టుగా మాట్లాడాడు వీరభద్రం.

వీరభద్రం మాటలతో మరింత కిర్రెక్కి పోయిన ముసలయ్య "ఏందయో ? మీతాయి ఈరభద్రం ! ఏంది నువ్ మాట్లాడేదీ? నువ్ లచ్చలు బోసి పాడినవో? ఆ ఎమ్.ఎల్.ఎల్.కి మూటలు మోసి పాడినవో మాకెందుకు? ఐనా నాకు తెలువ కదుగుతా ! గవర్నమెంటుంది జనాన్ని ఆదుకుంటానిగ్గాన్ని, నీలాంటి బ్రోకర్లకు తాళాలిచ్చి పుల్లిందలు పెట్టదానిగ్గాదు. నేనీ ఇసుక తోలుక పోయి యాపారం జెయ్యట్లే, ఎనికేసుకోట్లే. ఏదో ఇంటి కట్టు బడికి అవసర మొచ్చి తోలుక పోతున్నా" రాతి మీద పెంకులు పగులకొట్టినట్టు ఫెళ్ళు, ఫెళ్ళున మాట్లాడాడు.

ముసలయ్య ధాటికి బిక్కచచ్చిపోయిన వీర భద్రం 'ఛీ వీడియమ్మ ! వద్దొద్దనుకుంటూనే వీడినోట్లో నోరుపెట్టడం తప్పయ్యింది" అనుకుంటూ తనకు తనే లెంపలేసుకుని ఇసుక లారీలవైపు సాగి పోయాడు.

✿ ✿ ✿

వెళ్ళిపోతున్న వీరభద్రాన్ని గురించి ఆలోచించసాగాడు ముసలయ్య.

ముసలయ్యది కృష్ణకు పడమర వొడ్డునున్న గింజుపల్లి. వీరభద్రానిది కృష్ణకు తూర్పువైపునున్న వేదాద్రి.

చిన్నప్పటినుండి ఇద్దరూ ఒకరినొకరు ఎరిగున్నవాళ్ళే.

ఇప్పుడంటే ఇసుక క్యారీలొచ్చి వీరభద్రానికి నడమంత్రపుసిరి పడిశం పట్టినట్లు పట్టింది గాని, ఐదారేండ్ల కింద ఎట్లుండేవాడు!? ఎలిసిపోయిన లుంగీలు కట్టుకుని, మోచేతులు దిగిన ముతక చొక్కాలు తొడుక్కుని, వేదాద్రి గుడిముందు బొంగు

బియ్యం, శనగపప్పు, కట్టె మిఠాయి, చిలకల దండలు మంచం మీద పెట్టుకుని అమ్ముకుంటూ రోజు బత్తెం రోజు వెళ్ళదీసుకునేవాడు. అటువంటి మిఠాయి వీరభద్రం, ఇటువంటి ఇసుక వీరభద్రంగా మారడానికి మధ్య పెద్దకథే ఉంది.

అధికారపార్టీ ఎమ్.ఎల్.ఎ వెంకటాద్రికి మిఠాయి వీరభద్రానికీ తిరగేస్తే బావా బామ్మర్దుల చుట్టరికం ఉంది. అదుగో ఆ బంధుత్వాన్ని అడ్డం పెట్టుకున్న వీరభద్రం వెంకటాద్రి దగ్గర ప్రాపకం సంపాదించాడు. ఆ ప్రాపకంతోనే ఎమ్.ఎల్.ఏ.కి బినామీగా ఇసుక వ్యాపారంలోకి దిగాడు.

అంతే ! ఇక అక్కణ్నుంచి వెనక్కి తిరిగి చూడలేదు వీరభద్రం.

అటు వదినేపల్లి నుండి ఇటు ఉస్తేపల్లి దాకా రేవులు ఎన్నైనా కాంట్రాక్టర్ మాత్రం వీరభద్రం ఒక్కడే!

జనం అట్లా చూస్తుండగానే ఇట్లా రేవుల్లోని కోట్లరూపాయల ఇసుకను చాపకింద నీరులా ఊడ్చెయ్యసాగాడు వీరభద్రం.

ఐతే, దొంగల్లో దొరలా ఎంత వ్యాపారం జేసినా అటు ఎమ్.ఎల్. ఎ. దగ్గర్నుండి ఇటు ఊరి ప్రెసిడెంట్ వరకు పార్టీల ప్రమేయం లేకుండా నాయకులందరికీ ఎవరికెంత ముట్టజెప్పాలో అంత ఖచ్చితంగా ముట్టజెప్పేవాడు వీరభద్రం.

వీరభద్రం ఇసుక వ్యాపారానికి రాజకీయ బలంతో పాటు, భౌగోళికంగా కూడా కలిసొచ్చింది.

పులిచింతల ప్రాజెక్ట్ దాటి దిగువున కొండల గుండెలను వొరిపిడి పడుతూ ముందుకు సాగే కృష్ణమ్మను పరికించి చూస్తే అటు వదినేపల్లి నుండి ఇటు ఉస్తేపల్లి దాకా ఓ ఆవుపొదుగులా నది ఒంపు తిరిగి ప్రవహిస్తుంది.

అదుగో ఆ వంపు కారణంగా అక్కడిదాకా పరుగులు తీస్తూ వచ్చే కృష్ణమ్మ కాస్తా వడి తగ్గి మెల్లగా సాగుతుంది. దాంతో అక్కడి దాకా కొట్టుకొచ్చిన ఇసుక, నీళ్ళ వేగం మందగించడంతో పొరలు, పొరలుగా మేటలు వేస్తూ నిల్చిపోతుంది. ఆ మేటలే వీరభద్రం పాలిటి వరాల మూటలయ్యాయి.

✿ ✿ ✿

గింజువల్లి ఊరంతా కలిపినా రెండువందల గడప కూడా దాటని చిన్నపల్లెటూరు.

ఊళ్ళో ఒక వంతు రైతులుంటే, మూడొంతులు కూలీ, నాలీ జనాలుంటారు.

కృష్ణమ్మ వడిలో హాయిగా సాగిపోతున్న ఊరుమ్మడి బతుకు ఇసుక క్యారీల మూలంగా వొడిదుడుకులకు లోనవ్వసాగింది.

ఏడాదికోసారి వేదాద్రి నరసింహస్వామి కళ్యాణానికొచ్చే భక్తుల సందడి తప్ప వేరే అలికిడి ఎరుగని ఊరు కాస్తా ఇప్పుడు పెనుగంచిప్రోలు తిరునాళ్ళు మాదిరిగా తయారయ్యింది.

ఇసుక లారీల తాకిడికి ఊరంతా గుంతలు పడి నడవలేని పరిస్థితికొచ్చింది. చూసీ, చూసీ విసుగొచ్చిన గ్రామస్తులంతా ఓరోజు పొద్దున్నే ఇసుకలారీలు ఊళ్లోకి రాకుండా ఎడ్లబండ్లు అడ్డుపెట్టారు.

విషయం తెలిసిన వెంటనే పరుగులు పెడుతూ వచ్చిన వీరభద్రం "అటు చూస్తే లక్షలు బోసి టెండర్లుపాడాం. ఇటు జూస్తే వర్షాకాలం నెత్తిమీదికొస్తుంది. ఏంచెయ్యాలో తోచక మేం ఛస్తుంటే మధ్యన మీ సొదేందయ్యా !" అంటూ ఊరి జనాలమీద విరుచుకుపడ్డాడు.

"అరే ! గుంతలువడి ఊరు పనికిరాకుండవు తుందని మేం చెబుతుంటే నువ్వేంటో కథలు చెబుతా వేంటయా !" అంటూ లేచాడు ముసలయ్య.

పరిస్థితి బాగోలేదని గ్రహించిన వీరభద్రం "సరే ! ఇన్నాళ్ళూ ఓపిక పట్టినోళ్ళు ఇంకో నెలరోజులు ఓపిక పట్టండి. మొన్ననే పగడాలోళ్ళ కుంకుడు చెట్టు చేను లీజుకు తీసుకున్నాం. ఆ మిట్టమీది ముత్యాలమ్మ గుడి దగ్గర్నుండి ఆ చేను మీదుగా ఏట్లోకి రోడ్డేసుకుని బండ్లను అటే తోలుకుపోతాం" ముందు బెదిరింపు లతో మొదలుపెట్టినా చివరికి దేబిరింతల్లోకి దిగి పోతూ మాట్లాడాడు.

వీరభద్రం మాటలకు ఊళ్ళోవాళ్ళెవ్వరూ ఉలకలేదు, పలకలేదు. దాంతో మరికొంత దిగివస్తూ "సరే, ఊళ్ళో రోడ్లన్నీ పాడయ్యాయంటున్నారు కదా! రోడ్లన్నీ సిమెంట్ చేయిస్తా, ఊళ్ళోవాళ్ళకు దుమ్ము లేవకుండా రోజుకు మూడుసార్లు ట్యాంకులు పెట్టి నీళ్ళు కొట్టిస్తా" అంటూ ఊరిజనానికి 'ఎర' వేసాడు వీరభద్రం.


వీరభద్రం ఉచ్చులో పడిపోయిన కొందరు ఊరువాళ్ళు "సర్లే పోనీండి ! సిమెంట్ రోడ్లేయిస్తానం టున్నాడు కదా !" అంటూ మెత్తబడ్డారు.

ఆ సర్దుబాటు తనకిష్టం లేకపోయినా నలుగురితో పాటు 'నారాయణ' అనక తప్పలేదు ముసలయ్యకు.


✿ ✿ ✿

"అరరే ! అంతా వొకపక్కకే వస్తే నాదీ తిరగబడుద్ది. ఎక్కడోళ్ళు అక్కడే నిలబడండి. లంగరేసి నంక దిగుదురుగాని" వేదాద్రి రేవునుండి గింజుపల్లి రేవుకొచ్చిన వాళ్ళనుద్దేశిస్తూ పడవాళ్ళు వేస్తున్న కేకలతో ఆలోచనలు చెదిరిపోయి వాస్తవంలో కొచ్చాడు ముసలయ్య.

అలా వాస్తవంలోకొచ్చి చూసేసరికి బండి కాస్తా రేవులోనే ఆగి ఉండడంతో "అరే ! నేరుగా రేవులోకి వచ్చి ఆగార్రా !" అంటూ ఎద్దుల మూపు రాలను, గంగడోళ్ళను ఆప్యాయంగా దువ్వి బండి



డా॥ఎన్.గోపి రచించిన 'జలగీతం, నానీలు' గ్రంథాల కన్నడ అనువాదాలను (జలగీతె, నన్న నిన్నవు) బెంగుళూరులోని కర్ణాటక తెలుగు అకాడమీ అధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రఖ్యాత కన్నడ రచయిత డా॥యు.ఆర్.అనంతమూర్తి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో వరుసగా జలగీతం అనువాదకులు డా॥మార్కండాపురం శ్రీనివాస, కె.టి.ఏ అధ్యక్షులు డా॥ఎ.రాధాకృష్ణరాజు, మూలకవి గోపి, నానీలు అనువాదకులు ప్రొ॥కె.బి.నారాయణప్రసాద్ ఉన్నారు.




జల్లలోకి ఇనుక ఎత్తి పోయడం మొదలుపెట్టాడు ముసలయ్య.

✿ ✿ ✿

గింజుపల్లి ఊరు కృష్ణ వొడ్డున్నే ఉన్నా గ్రామస్థులకు మూడొందలరవై రోజులూ నీటి కరువే. ఊళ్ళో తీద్దామంటే బావులు పడవు. ఒకవేళ వడ్డా అంతలోతులోనుండి నీళ్ళు తోడడం మామూలు మనుషులతో అయ్యేవని కాదు. అందుకే ఊరి ఆడవాళ్ళంతా పొద్దున్నే రేవులోకి దిగి నదిలోనే బొచ్చెలు, బోళ్ళు తోముకుని, బట్టలు పిండుకుని, తల్లులు – పిల్లలు అక్కడే స్నానాలు చేసి బిందెల్నిండా చెలిమనీళ్ళు నింపుకుని ఇండ్లకు చేరుతారు.

ఇప్పుడు రేవులో ఇసుకంతా తోడెయ్యడంతో చెలిమలన్ని మాయమైపోయి బిందెడు నీళ్ళకోసం వేదాద్రి రేవుదాకా వెళ్ళాల్సి రావడంతో ఆడవాళ్ళకు మరీ కష్టమైపోవడంతో వాళ్ళంతా వీరభద్రానికి గండశాపాలు పెట్టసాగారు....

కుండమీద పూతరేకులు తీసినట్టు నది గర్భంలో పొరలు, పొరలుగా ఇసుకమేటలు తీరి ఉండడంతో ఉత్సాహంతో రెచ్చిపోయిన వీరభద్రం ఎక్కణ్ణుంచో క్రేన్లు తెప్పించి మరీ ఇసుక లారీలు నింపించడం మొదలుపెట్టాడు.

అట్లా క్రేన్లతో అడుగుకంటా ఇసుక తోడేసిన నది రాళ్ళూ – రప్పలూ తేలి, తోలు వలిచి పారేసిన కొండచిలువలా చూడడానికే భయంకరంగా అన్పించ సాగింది.

ఇదంతా చాలదన్నట్టు ఊరికి ఉత్తరంగా ఉన్న గ్రామకంఠం భూమిలో నదిలోనుండి తోలుకొచ్చిన ఇసుకనంతా గుట్టలు, గుట్టలుగా పోయడం మొదలుపెట్టాడు వీరభద్రం. దాంతో ఊళ్ళో పశువులు మెదలడానికి కూడా వీలుకాక రైతులంతా ఇబ్బందులు పడసాగారు.

✿ ✿ ✿

ఆ ఏడు కత్తెరలోనే చిత్తుగా వర్షాలు పడడంతో పునాసదుక్కులు మొదలుపెట్టిన రైతులు వ్యవసాయ పన్లకోసం కూలీలనడిగితే వస్తామన్న మనిషే లేకపోవడంతో విస్మయానికి లోనయ్యారు.

పనికెందుకు రారని గట్టిగా అడిగితే "ఏముంది? జతమనుషులం అట్లా బొయ్యి ఆడుతూ, పాడుతూ గంటసేపు లోడు జేస్తే మూడొందలొస్తున్నై. అదే రైతు పనికి పోతే ఏముంది? పొద్దుగూకులు చేసినా వందరూపాయలియ్యరు" అంటూ ముఖం మీదనే చెబుతున్నారు కూలీలంతా.

ఇక వాళ్ళతో ఏం మాట్లాడాలో అర్థంకాని రైతులు "రేపు వానలు పడి కృష్ణకు ఎల్లువొస్తే అప్పుడు చచ్చినట్టు పన్లకోసం వాళ్ళే వస్తార్లే" అనుకున్న రైతులు మళ్ళీ వానకోసం చూడసాగారు.

ఏ ఒక్కరి ఆలోచనలతోనూ ప్రమేయం లేని కాలం, తన మానాన తాను ప్రవాహమై సాగిపోతూనే ఉంది...

తొలకరి వానలు మళ్ళీ ఊపందుకున్నాయి.

ఎల్లువెత్తిన కృష్ణమ్మ రెండు దరులనూ వొరుసుకుంటూ పరుగులు తియ్యసాగింది....

భూమంత తొలకరింతలతో రైతుల పులకరింతలు మొదలయ్యాయి.

ఐతే, వానలు పడితే వాళ్ళే పన్లకొస్తారెమ్మంటూ అనుకున్న రైతుల అంచనాలను తల్లకిందులు చేస్తూ కూలీలెవ్వరూ పన్లకోసం రాకపోవడంతో రైతులే కూలీల ఇండ్లకెళ్ళి పన్లకు రమ్మంటూ బ్రతిమాలినా వాళ్ళు పెడచెవిన పెట్టసాగారు....

కృష్ణకు వెల్లువొచ్చి ఇసుక క్వారీలు బంద్దైనా కూలీలెందుకు పన్లకు రావడంలేదో వారంపది రోజులకు గాని రైతులకు తెలిసిరాలేదు.

✿ ✿ ✿

ఊళ్ళో రైతుల దగ్గర పన్లకు పోతే ఏమొస్తుంది? బూడిద ! ఇంకో నాలుగురోజులు పోతే మళ్ళీ మన ఇసుకలోల్లు మొదలవుతాయి. అప్పటిదాకా ఖర్చులకు కావాలంటే అడ్వాన్స్ లిస్తా తీస్కోండి. ఆనాడు రోడ్డుకి ఎడ్లబండ్లు అడ్డంబెట్టి సిమెంట్ రోడ్డేయించుకున్న రైతులమీద ఈ విధంగా కక్ష సాధింపుకు పూనుకున్న వీరభద్రం అడిగిన వాళ్ళకు అడిగినంత అడ్వాన్స్ లివ్వసాగాడు.

విషయం తెలిసిన రైతులంతా శివాలయం దగ్గర చేరి "ఆ, వీరభద్రంగాడి ఆగడాలన్నీ – నాయకులతో చెప్పుదాం పదండి".

"ఏ నాయకులకు చెబుదాం? అన్ని పార్టీల నాయకులకూ ఇసుకదందాలో వాటాల్లెవ్వా?

"అసలీ గోలంతా ఎందుగ్గాని మనం గూడా వ్యవసాయాలొదిలిపెట్టి ఏదో ఒకటి చేద్దాం పదండి" అంటూ వాళ్ళల్లో వాళ్ళే రకరకాలుగా చర్చించుకున్నా ఎటూ తేల్చుకోలేక ఎటువాళ్ళటు లేచిపోయ్యారు.

✿ ✿ ✿

కూలీలవాడలో జండాల దిమ్మెల దగ్గర తీరిగ్గా కూర్చున్న కూలీలు "ఈ దెబ్బతో కూలోడంటే ఏందో రైతులకు తెలిసొస్తుంది"

''ఊరుకోండ్రా కుర్రసన్నాసుల్లారా ! ఏందిరా తెలిసొచ్చేది? కాకుంటే పదెకరాలు సాగుజేసే రైతు రెండకరాలే సాగుజేసుకుంటాడేంది? ఇయ్యాలంటే రోజులిట్లా మారిపోయినై గాని, ఎనకట్నుంచి కూలోనికి అన్నంబెడుతుంది రైతులుగాదా? అళ్ళూ, మనం ఒక్క తల్లిపిల్లల్లెక్క బతుక్కుంట రావట్లేదా? ఇయ్యాల ఈ ఈరభద్రం బ్రోకర్ మాటలిని రైతులతో ఇరోదం దెచ్చుకుంటే ఎట్లా? ముందు, ముందు జరుగుబాటు కూడా చూసుకోవద్దా?"

ఇయ్యాల ఇసుకలోళ్ళకు బోతే మరిన్ని డబ్బులొస్తాయేమో గాని, తిండిగింజలొస్తయా? డబ్బుల్దింటే ఆకల్దీరిద్దా? కుర్రయవ్వారాలు జేయకండి"

"హ్హా పోండే ! మీ ముసలోళ్ళంతా ఇంతే మాట్లాడతారుగాని."

"ఎవ్వడికైనా ముద్దొచ్చినప్పుడే సంకెక్కాలన్నట్టు మోకా దొరికినప్పుడే నాలుగురాళ్ళు ఎనకేసుకోవాల" అంటూ ముసలోళ్ళు, పడుచోళ్ళు రెండు ముఠాలుగా విడిపోయి చర్చించుకోసాగారు. కాని, ఎవ్వరూ రైతుల దగ్గరకు పనులకోసం మాత్రం వెళ్ళలేదు.

అట్లా వీరభద్రం రగిలించిన ఇసుక తుఫాను ఊరును చుట్టేసింది.

✿ ✿ ✿

"నిండు ఏటిలో ఇసుకనెట్లా ఎత్తుకుపోతారో చూద్దాం" అనుకుంటూ రైతులంతా ఎదురుచూడసాగారు...

ఎదురు చూసినట్టే ఓరోజు పొద్దున్నే లెక్కకు మించిన నాటుపడవలొచ్చి రేవునిండా నిలబడ్డాయి. ఒక్కసారే అన్ని పడవలొచ్చి రేవులో ఆగడం చూసిన ఊరిజనం విస్తుబోయారు.

అంతలోనే కొంతమంది కూలీలు పడవల్లో ఎక్కి ఓ బారపొడవు తాళ్ళు కట్టిన మందపాటి ఇనుప

బక్కెట్లను తీసి నీళ్ళల్లో నిలబడ్డ మరికొందరి కూలీలకు అందించారు.

బక్కెట్లు అందుకున్న కూలీలు తాళ్ళ చివరలు పట్టుకుని వాటిని నీళ్లల్లోకి జారవిడిచి నది వాలుకు వ్యతిరేకంగా అడ్డం పడవేసి కాలి బొటనవేళ్ళతో ఇసుకలోకి తొక్కగానే బక్కెట్లు మొత్తం ఇసుకతో గిర్రున నిండిపోవడంతో వాటిని పైకి చేదగానే, వాటి అడు గున జల్లెడ మాదిరిగా చేసి ఉంచిన రంధ్రాల గుండా నీళ్ళన్నీ కారిపోగానే తాళ్ళను నావల్లోకి కూలీలకు అందించారు. బక్కెట్లు అందుకున్న కూలీలు ఇసుకను పడవల్లో గుమ్మరించి మళ్ళీ బక్కెట్లను కిందికి ఇచ్చారు.

చూస్తుండగానే పడవలన్నీ ఇసుకతో నిండి పోయాయి.

ఇసుకను నింపుకున్న పడవలన్నీ నిండు గర్భిణుల్లా కదులుతూ రావిరాల రేవుదిక్కు కదిలాయి.

అప్పటకే రావిరాల రేవులో తయారుగా ఉన్న కూలీలు కొందరు పడవల్లోని ఇసుకనంతా ఎత్తి నదివొడ్డున్నే తీసి ఉంచిన నేలబారు ర్యాంపుల్లో ఆగి ఉన్న లారీల్లో నింపేశారు.

✿ ✿ ✿

తమకళ్ళముందే నిండు నదిలో కూడా ఇసుక ఎత్తుకు పోవడం చూసిన రైతులంతా చేష్టలుడిగి నిల్చుండిపోయారు.

అప్పుడు జరిగిందో అనూహ్య సంఘటన!

అప్పటిదాకా జరుగుతున్న వ్యవహారమంతా చూస్తూ నిల్చున్న ముసలయ్య మనసులో ఏ ఆలోచ నలు విస్ఫులించాయో గాని కోపంతో గొంతు బొంగురుబోతుంటే "అమ్మ ! నీయమ్మ వీరభద్రంగా! ఎంత పథకమేశావురా ! నిన్నిట్లా చూసుకుంటూ వదిలేస్తే ఏదోరోజు మమ్మల్ని మింగేస్తావ్. ఇగ నిన్ను వదిలిపెట్టగూడదు. మా కండ్లు మా వేళ్ళతోనే పొడిపించినట్టు ఊళ్ళో రైతులకు, కూలీలకూ మధ్య కుంపటి రగిలించింది చాలక కన్నతల్లిలాంటి నదిని నిలువునా దోచుకుపోతున్నావు ఇయ్యాల నీ సంగతి తేల్చకపోతే మాకు పుట్టుగతులుండవు" అంటూ ఆ పక్కనే విడిచి ఉన్న ఎడ్లబండి వసిగర్రనోదాన్ని అందుకుని రేవులోకి పరుగునందుకున్నాడు.

అంతే !

ఊరికి గట్టు తెగిపోయింది.

జనం వరద ఫెళఫెళా మంటుకదిలింది.

ఊరు ఊరంతా కేకలు పెడుతూ దొరికిన వస్తువునల్లా అందుకుని ముసలయ్య వెనుక కదిలింది.

ఆ జనచైతన్యానికి గాలికూడా స్థంభించి చూడసాగింది...

మంట

అప్పటిదాకా తనను కమ్మి ఉంచిన మేఘపు అడ్డుగోడలను బద్ధలు కొట్టుకుని బయటకొచ్చిన సూర్యుడు కూడా నిప్పులు కక్కసాగాడు !

అంతదాకా రేవులోపల విలాసంగా తల పరికిస్తూ నిల్చున్న వీరభద్రం జనం ఉధృతికి భయపడి నదిలోకి దూకేసాడు.

# పాఠకులకు విజ్ఞప్తి

మాతృభాషా దినోత్సవ సందర్భంగా తెలుగుభాషా సాహిత్యాలను ఇప్పటి తరానికి పరిచయం చేయడానికి ఆ వెలుగులో వాళ్ళు తమకు తాము నిర్మించుకోవడానికి, వికసించుకోవడానికి అవకాశం కల్పించే దిశగా **చినుకు** మాసపత్రిక ఒక వినూత్నమైన పథకానికి శ్రీకారం చుట్టింది.

ఈ పథకంలో భాగంగా **చినుకు** స్వయంగా కొన్ని పాఠశాలలను ఎంచుకొని, రెండు సంవత్సరాలు **చినుకు** పత్రికను ఉచితంగా పంపుతోంది.

ఇదే విధంగా మీలో ఎవరైనా **చినుకు** పత్రికను మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన పాఠశాలలు / కళాశాలలు / గ్రంథాలయాలు మరే ఇతర సంస్థలు లేదా వ్యక్తులకైనా పత్రిక పంపదలచుకుంటే చందాదారుల పేరుతో పాటు పత్రికను పంపుతున్నవారి వివరాలను పత్రికలో ప్రకటించటం జరుగుతుంది. ఈ **చేయూత** పథకానికి గాను చందాలను ఎం.ఓ./డి.డి./చెక్కులను **చినుకు** మాసపత్రిక, విజయవాడ పేర చినుకు కార్యాలయానికి పంపగలరు.

చందాలు డి.డి లేదా చెక్కులకు (రు.20/-లు అదనంగా) లేదా ఎం.ఓ, రూపంలో

"చినుకు మాసపత్రిక, విజయవాడ"

చినుకు మాసపత్రిక,

✆ 0866-6640595, E-mail : editor_chinuku@yahoo.com